# 18 వ వసంతంలోకి ... సూర్య

www.suryaa.com

రంగారెడ్డి-వికారాబాద్-మేడ్చల్

బుధవారం 23 అక్టోబర్ 2024 | పేజీలు : 8


## సింగిల్‌విండో దీర్ఘకాలిక రుణాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి




ఆమనగల్లు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 22): ఆమనగల్లు సింగిల్‌విండో ద్వారా రైతులు, వ్యవసాయ దారులకు దీర్ఘకాలిక రుణాలు మంజూరుచేయడం జరుగుతున్నట్లు ఆమనగలు, కడ్తాల్ సింగిల్‌విండో చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ తెలిపారు. మిగతా 2లో

- నవంబర్ మొదటి వారంలో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మధ్య దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలి
- అర్హులైన రైతులు, వ్యవసాయ కార్మికులకు డిసిసిబి ద్వారా దీర్ఘకాలిక రుణాలు
- వివరాలు వెల్లడించిన సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్త

# మద్యం మత్తులో... పల్లెలులో...చిచ్చులు

- కుటీర పరిశ్రమల్లా బెల్టు దుకాణాలు
- నియంత్రించాల్సిన వారు నిమ్మకుంటున్నారు
- టార్గెట్‌ల సాధనలో ఆబ్కారీ శాఖ అధికారులు



షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 22) : ప్రశాంతంగా ఉన్న పచ్చని పల్లెల్లో మద్యం చిచ్చు రేపుతుంది.. ఒకప్పుడు మండల కేంద్రాలకు, పట్టణాలకే పరిమితమైన మద్యం దుకాణాలు నేడు పల్లెల్లో గల్లీకి ఒకటి దర్శనమిస్తున్నాయి. మద్యం షాపుల నుండి గ్రామీణ ప్రాంతాలకు చెందిన హోటళ్లు, కిరాణ దుకాణదారులు మద్యాన్ని తీసుకువచ్చి గ్రామాలలో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకోవడం సర్వసాధారణంగా మారింది. గ్రామాల్లో మద్యం విక్రయాల పరిస్థితి చూస్తే స్వయం ఉపాధి కోసం కుటీర పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయా అనే అనుమానం కలగక మానదు. చిన్న పల్లెల్లో సైతం పది నుండి పన్నెండు అక్రమ మద్యం అమ్మే బెల్టు షాపులు ఉన్నాయంటే అతిశయోక్తి కాదని చెప్పవచ్చు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు, చౌదరిగూడెం, కేశంపేట, నందిగామ, కొత్తూరు, ఫరూఖ్‌నగర్ మండలాల్లో ఉన్న మెజార్టీ గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చల విడిగా దర్శనమిస్తున్నాయి. ఈ బెల్టు షాపుల మూలంగా చిన్న పిల్లలు, వృద్ధులు, కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కొన్ని గ్రామాలలో యువకులు ముందుకు వచ్చి బెల్టు షాపులకు వ్యతిరేఖంగా గ్రామస్థులను చైతన్యం చేస్తున్నారు. అయినప్పటికీ బెల్టు షాపుల యజమానులు మాత్రం తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. మిగతా 2లో

## వారం రోజులైనా తగ్గుతలే...

- మేడ్చల్ మండలంలో విషజ్వరాల విజృంభణ
- ఒకే ఇంట్లో ఇద్దరి నుంచి ముగ్గురు బాధితులు
- విలవిల్లాడుతున్న జనం



మేడ్చల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 23) :గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. కొద్ది రోజులుగా ప్రబలుతున్న జ్వరాలతో జనం ఆందోళన చెందుతున్నారు. దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, జ్వరంతో విలవిల్లాడుతున్నారు. వారం, పది రోజులైన జ్వరాలు తగ్గకపోవడంతో ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. దీంతో ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. కొందరు వైరల్ జ్వరం, మరికొందరు డెంగీ, టైఫాయిడ్ బారిన పడుతున్నారు. పెరుగుతున్న జ్వరపీడితులు మేడ్చల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు విషజ్వరాలు కలవరపెడుతున్నాయి. మేడ్చల్ పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఉన్న చాలా మంది ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. రోజు రోజుకు బాధితులు పెరుగుతుండడంతో ఆందోళన వ్యక్తమవుతుంది. మిగతా 3లో

## పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు చర్యలు తీసుకోవాలి

### రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 22): ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మిగతా 3లో

## వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

### ★ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్






వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22)ః వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారము కల్లెక్ట్రేట్ సమావేశము హాలు నందు వానా కాలం 2024 -25 దాన్యం కొనుగోళ్ల పై సన్నాహక మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం మద్దత్తు ధర క్వింటాల్ గ్రేడ్ ఎ రకానికి రూ 2320 సాదారణ రకానికి రూ .2300 మరియు సన్న రకానికి అదనంగా రూ 500 చెల్లించడం జరుగుతుందని, కొనుగోళ్ళు కేంద్రాల వారు సన్న రకం ధాన్యం గుర్తించడంలో ఎ ఇ ఓ , ఎ ఓ వ్యవసాయ అధికారుల సహకారము తెసుకోవాలని అన్నారు. కొనుగొలు కేంద్రాల యందు సన్న ధాన్యం, , దొడ్డు దాన్యం వేరు వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, . కొనుగోలు కేంద్రంలో సన్న దాన్యం నింపు గొనె సంచులకు ఎర్ర దారం తో కుట్టి వేయాలని, "ఎస్" అనే అక్షరం ముద్రించాలని ,దొడ్డు దాన్యం నింపు గొనె సంచులకు ఆకుపచ్చ దారంతో కుట్టి వేయాలని, సన్న దాన్యం దొడ్డు దాన్యం వేర్వేరు లారీలలో నింపి రైస్ మిల్లులకు రవాణా చేయాలని, జిల్లా లో మొత్తం 130 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అందులో 18 సన్నరకం ధన్యం కొనుగోలు కేంద్రాలు, మిగతావి దొడ్డు రకం ధన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. రెండు ఒకే కేంద్రం లో కొనుగోలు చేయడం కుదరదని అన్నారు. మిగతా 3లో

# మద్యం మత్తులో... పల్లెలులో..చిచ్చులు

**మొదటిపేజీ తరువాయి...** మండల, పట్టణ కేంద్రాల నుండి తెచ్చిన మద్యాన్ని గ్రామాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ బెల్టు షాపుల నిర్వాహకులు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయల్లా నిర్వహిస్తున్నారు.

నిబంధనలు ఎక్కడికి పోయాయి..?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్న పిల్లలకు మద్యం విక్రయాలు చేయరాదు. అంతేకాదు మద్యాన్ని అమ్మేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా లైసెన్సులను కేటాయించి అనుమతిస్తుంది. ఒకవేళ లైసెన్సు లేకుండా మద్యం విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఆబ్కారీ శాఖ అధికారులను నియమించింది. ఇదిలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నా షాద్‌నగర్ ఎక్సైజ్ అధికారులు మాత్రం వాటిని అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. గ్రామాలలో విచ్చలవిడిగా మద్యం లభించడంతో చిన్న పెద్ద అనే తేడా లేకుండా మద్యం అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఇంకేముంది చిన్న పిల్లలు కూడా మద్యానికి బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గాంధీ జయంతి, ఆగస్టు 15, జనవరి 26 వంటి రోజుల్లో కూడా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం లభిస్తుండడంతో పట్టణం నుండి మద్యం కోసం పల్లెలకు పరుగులు పెడుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నియోజకవర్గంలో ఉన్న గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరందుకుంటున్నాయి.

టార్గెట్‌ల వేటలో ఆబ్కారీ శాఖ..

ప్రభుత్వం ద్వారా లైసెన్సులు పొందిన మద్యం దుకాణాల్లో అమ్మకాలు పెంచేందుకు ఆబ్కారీ శాఖ అధికారులకు టార్గెట్‌లు ఉండడం సహజమే. ఆయా టార్గెట్‌లను పూర్తి చేయాలంటే మద్యం దుకాణాల్లో అమ్మకాలు పెరగాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల జోరు కొనసాగుతున్నా స్థానిక ఎక్సైజ్ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మద్యం విక్రయాల కోసం పల్లెల్లో ప్రత్యేక కౌంటర్లు తెరిచి సిట్టింగులు ఏర్పాటు చేసినా ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పుడప్పుడు ఎస్‌వోటీ అధికారుల తనిఖీల్లో గ్రామాల్లో బెల్టు షాపులపై కేసులు నమోదు అవుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం బెల్టు షాపుల విషయంలో కేసులు నమోదు చేయకపోవడంపై వారి తీరుపై ప్రశ్నల వర్షం కురుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో బెల్టు షాపులు లేకుండా కేవలం లైసెన్సు గల మద్యం దుకాణాల్లోనే మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రకటనలు చేసినా సంబంధిత అధికారుల నిర్లక్ష్యం మూలంగా అవి అమలు కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

# పార్లమెంట్ ఎన్నికల సెక్టోరియల్ అధికారులకు గౌరవవేతనం అందేనా..!

- కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల విధులు నిర్వహించిన **25**మంది సెక్టోరియల్ అధికారులు
- ఈ యేడాది ఏప్రిల్ మొదలు మే **13**పోలింగ్ వరకు సుమారు **20**రోజులకు పైగా విధులు
- గౌరవ వేతనంగా ఒక్కో అధికారికి అందాల్సిన రూ.**10**వేల**500**లు నేటికి అందని వైనం
- మిగతా నియోజకవర్గాల ఎస్.ఓలకు గౌరవవేతనం అందినప్పటికి కల్వకుర్తిలో నేటికి అందకపోవడం వెనుక ఆంతర్యమేమిటంటున్న అధికారులు, ఉద్యోగులు




మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22): 2024లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గంలో సుమారు 25మంది సెక్టోరియల్ అధికారులు ఎన్నికల విధులు నిర్వహించారు. వీరిలో నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో 13మంది సెక్టోరియల్ అధికారులు ఉండగా మిగతావారు వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో విధులు నిర్వర్తించారు. కాగా ఈ యేడాది ఎన్నికల కోడ్ వెలువడింది మొదలు మే 13 పోలింగ్ ముగిసేవరకు ఎన్నికల విధుల నిర్వాహణకు ఒక్కో సెక్టోరియల్ అధికారికి ప్రభుత్వం ద్వారా 10వేల 500 రూపాయల గౌరవభృతి (వేతనం) అందాల్సి వుండగా పార్లమెంట్ ఎన్నికలు ముగిసి 5నెలలు గడిచినప్పటికి నేటికి వీరికి ఎలాంటి గౌరవ భృతి అందక పోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ పార్లమెంట్ స్థానాల పరిధిలో పనిచేసిన ఎస్.ఓలకే కాకుండ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని మిగతా నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించిన సెక్టోరియల్ అధికారులందరికి 10వేల 500 రూపాయల చొప్పున గౌరవ భృతి దక్కగా కేవలం కల్వకుర్తి నియోజకవర్గంలో పనిచేసినవారికి మాత్రమే ఎందుకు రావడం లేదో అర్థం కావడం లేదని పలువురు అధికారులు, ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ విషయమై మంగళవారం మేజర్‌న్యూస్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కల్వకుర్తి ఆర్‌డిఓను ఫోన్ ద్వారా వివరణ కోరగా సెక్టోరియల్ అధికారులకు చెల్లించాల్సిన బిల్లులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, ఏ నిమిషమైనా అందవచ్చని తెలిపారు. ఏది ఏమైనా కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వర్తించిన తమకు ప్రభుత్వం ద్వారా సత్వరమే గౌరవ భృతి (వేతనం) అందేలా జిల్లా ఉన్నతాధికారులు చొరవచూపాలని వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు కోరుతున్నారు.

# సేవాకార్యక్రమాలకు నరేందర్ ముదిరాజ్‌కు సేవారత్న పురస్కారం



కందుకూరు, మేజర్‌న్యూస్ ( అక్టోబర్ 22): వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగాను తాళ్ల నరేందర్ ముదిరాజ్‌కు సేవారత్న పురస్కారం అందించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మహాత్మగాంధీ గ్లోబల్ శాంతి అవార్డును 2024 సంవత్సరానికి గాను నరేందర్‌కు అందించారు. నరేందర్ మాట్లాడుతూ... దేశ సమైక్యత,అభివృద్ధికి కృషి చేస్తానని,ఈ ఈ అవార్డు నాలో మరింత బాధ్యత పెంచిందని తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహిస్తాని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ డాక్టర్. బండ ప్రకాష్,బోగారపు దయానంద్, బొర్ర కుమార్, సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌నారాయణ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపార స్తులు నిబంధనల ప్రకారం వ్యాపారాలు నిర్వహించాలి : బీజేఎంసీ కమిషనర్ శరత్‌చంద్ర



గండిపేట్, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22) : బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో వీధి వ్యాపారులు నిబంధనల మేరకు వ్యాపారం నిర్వహించాలని కార్పోరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. మంగళవారం కార్పోరేషన్ పరిధిలోని ఖాళీమందిర్ సమీపంలో వీధి వ్యాపారుల మార్కెట్‌ను కమిషనర్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు కేటాయించిన వ్యాపార సముదాయాన్ని సదరు వ్యాపారి మాత్రమే నిర్వహించుకోవాలన్నారు. ఎవరు పడితే వారు ఈ వ్యాపార సముదాయాలలో వ్యాపారం చేయడానికి అవకాశం లేదన్నారు. వ్యాపారులకు కేటాయించిన సముదాయాన్ని ఇతరులకు అద్దెకు ఇచ్చిన, విక్రయించినా కేటాయించిన సముదాయాన్ని రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అంతేకాకుండా వ్యాపార సముదాయం సమీపంలో అసాంఘిక కార్యక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఈ మేరకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ టిఎంసీ, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్‌విండో దీర్ఘకాలిక రుణాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 22): ఆమనగల్లు సింగిల్‌విండో ద్వారా రైతులు, వ్యవసాయ దారులకు దీర్ఘకాలిక రుణాలు మంజూరుచేయడం జరుగుతున్నట్లు ఆమనగల్లు, కడ్తాల్ సింగిల్‌విండో చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ తెలిపారు. ఆమనగల్లు సింగిల్‌విండో కార్యాలయంలో మంగళవారం పాలకవర్గ సమావేశం ఏర్పాటుచేశారు. సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబర్ మొదటి వారంలో ఆమనగల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.రైతులు మధ్య దళారిలను నమ్మి మోసపోవద్దని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలని గంప వెంకటేష్ సూచించారు. వరి క్వింటాలుకు 2330 రూపాయల మద్దతు ధర పొందాలని ఆయన రైతులకు సూచించారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలంలో మండలానికి రెండు చొప్పున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు గాను ప్రోత్సాహకంగా 500 రూపాయల బోనస్ అందివ్వడం జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఆమనగల్ సింగల్ విండో, సహకార బ్యాంకుల ద్వారా గోట్ ఫార్మ్స్, ( మేకలు గొర్రెలకు సంబంధించి) ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు, పౌల్ట్రీ, డైరీ, జెసిబి, వ్యవసాయ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రుణాలను అందివ్వడం జరుగుతుందని అర్హులైన రైతులు, రైతు కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ కోరారు. దీర్ఘకాలిక రుణాలకు సంబంధించి ఎలాంటి అపోహాలున్నా రైతులు నేరుగా తనకు కానీ, సింగిల్‌విండో కార్యాలయంలో గాని సంప్రదించాలని చైర్మన్ వెంకటేష్ గుప్త కోరారు. ఈ సమావేశంలో మాడ్గుల సింగిల్‌విండో చైర్మన్ సూధిని తిరుమల్‌రెడ్డి, ఆమనగల్లు సింగిల్‌విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, బెల్లి వెంకటయ్య, డిసిసిబి మేనేజర్ గోపాల్, సీఈఓ దేవేందర్, సింగిల్‌విండో సిబ్బంది పద్మాకర్‌రెడ్డి, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం పార్టీని బలోపేతంకై కృషి చేయాలి



కందుకూరు, మేజర్‌న్యూస్ ( అక్టోబర్ 22): రాబోయే కాలంలో సీపీఎం పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకులు రాంచందర్, మండల కార్యదర్శి బుడ్డీరపు శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. సీపీఎం గ్రామశాఖ మహాసభల సందర్భంగా మంగళవారం మండలంలోని దెబ్బడగూడలో శాఖ మహాసభలను నిర్వహించారు. కార్యక్రమంలో రాంచందర్,శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఎగురువేశారు మూడు సంవత్సరాలలో గ్రామంలో చేసిన పోరాటాలపై చర్చించారు. భవిష్యత్‌లో పార్టీ తీసుకోవల్సిన నిర్ణయాలు, భూపోరాటాలు ఇళ్ల స్థలాలు,స్మశానవాటిక సమస్యలు, కుల అహంకార పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ శాఖ అధ్యక్షుడు రావిచెట్టు సతీష్ ఆధ్వర్యంలో సాతిరి కృష్ణ అధ్యక్షతన నూతన కార్యదర్శిగా రావిచెట్టు చందును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు సాతిరి సుధాకర్, బర్కం ప్రభాకర్, సాతిరి విజయలక్ష్మి, మండల రాములు పాల్గొన్నారు.

# కూరగాయల మార్కెట్‌కు స్థల పరిశీలన



మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22) : మండలంలోని ఆరుట్ల గ్రామంలో మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు సొసైటీ బ్యాంక్ ఆవరణ స్థలాన్ని మంగళవారం పిఏసిఎస్ చైర్మెన్ హన్మంత్ రెడ్డి తహసీల్దార్ ఎంవివి ప్రసాద్, ఎంపీడీవో బాలశంకర్‌లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సహకారంతో మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు ముందడుగు వేస్తున్నాం అన్నారు. ప్రస్థుతం ఉన్న కూరగాయల మార్కెట్ స్థలం సరిపోకపోవడం వలన ప్రజలు అవస్థలు పడుతున్నారని, పలు మార్లు గ్రామపంచాయతీ దృష్టికి కూడా సమస్యను తీసుకొచ్చారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి మంచాల సొసైటీ బ్యాంక్ సహకారంతో మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. స్థల పరిశీలనలో డైరెక్టర్ వెంకటేష్, గ్రామస్థులు రావుల బాషా తదితరులు ఉన్నారు.

## పాఠశాలల్లో ఆంగ్ల బోధనకు చర్యలు తీసుకోవాలి

**మొదటిపేజీ తరువాయి...**



మంగళవారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో విద్యాశాఖ కమిషన్ సభ్యులు పీఎల్.విశ్వేశ్వరరావు, సీహెచ్.వెంకటేశ్‌లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ సమక్షంలో విద్యావ్యవస్థలో పూర్వ ప్రాథమిక, ఉన్నత విద్యపై చర్చించారు. ప్రతీ పాఠశాలలో ఆంగ్ల బోధనకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొడంగల్ జడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల ఆవరణల్లో ప్రహరి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే విద్యా విధానంలో మార్పులు రావాలన్నారు. నాణ్యమైన విద్య కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సమీక్షించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి, కడా ప్రత్యేకాధికారి కె.వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

**మొదటిపేజీ తరువాయి...**

వరి ధాన్యం సేకరణ కేంద్రాల వద్ద త్రాగునీరు, టెంట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. వరి సేకరణ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పౌరసరఫరాల అధికారులు సమన్వయంతో సమిష్టిగా పనిచేసి వరి ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. . ధాన్యం సేకరణ కేంద్రాల్లో తేమ మిషన్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని, అదేవిధంగా గోనె సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్ని నియమ నిబంధనలను పాటిస్తూ , రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండ వరి దాన్యం సేకరణ జరగాలని అన్నారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు కేంద్రాల లో సన్న రకం, దొడ్డు రకం ఏ విదంగా గుర్తించాలనే విధానం అవగాహన కల్పించారు. సమావేశంలో ,అదనపు కలెక్టర్ లింగ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, డిసిఎస్ ఓ మోహన్ బాబు, డిఎంసిఎస్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, మార్కెట్టింగ్ అధికారి సారంగా పాని , డి సి ఓ నాగ లింగాచారి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ , ఐ కె పి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజులైనా తగ్గుతలే...

**మొదటిపేజీ తరువాయి...**

ఏ ఇంట్లో చూసినా చిన్న పెద్ద తేడా లేకుండా జ్వరాలతో సతమతమవు తున్నాం ు. మేడ్చల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, శ్రీరంగవరం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ఆయా గ్రామాల్లోని ఆర్‌ఎంపీల వద్ద కొంతమంది చికిత్స తీసుకుంటున్నారు. జ్వరం వచ్చిన వారిలో పదుల సంఖ్యలో బాధితులు పరీక్ష చేయించుకోగా వైరల్ లేదా డెంగీగా నిర్ధారణ అవుతోంది.

**పారిశుధ్య లోపమే కారణమా..? :** జ్వరాల విజృంభణకు గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడమే ప్రధాన కారణమని తెలుస్తోంది. పారిశుధ్య లోపం కారణంగా దోమలు స్వైర విహారం చేయడంతో ప్రజలను వ్యాధులు చుట్టుముడుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా వాతవరణంలో మార్పుల వల్ల సైతం జ్వరాలు వసున్నాయని, ఏ మాత్రం అనారోగ్యంగా అనిపించినా నేరుగా డాక్టర్లను సంప్రదించాలని పలువురు ప్రభుత్వ అధికారులు చెప్తున్నారే తప్ప వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం స్పందించడం లేదు.

## పోస్ట్ ఆఫీసులలో "గంగా జలం" వాటర్ బాటిల్స్ అమ్మకాలు

### ఉచితంగా గంగా జలం బాటిల్స్‌ను అందజేసిన బిజెవైఎం ఉపాధ్యక్షులు నల్లా వెంకట్ రెడ్డి



కీసర,మేజర్ న్యూస్ (అక్టోబర్, 22):ఇక పోస్ట్ ఆఫీసు ల్లో పవిత్ర గంగా జలం" వాటర్ బాటిల్స్ అమ్మకాలు జరుపుతున్నట్లు మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి యువ మోర్చా వైస్ ప్రెసిడెంట్ నల్ల వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నల్ల వెంకట్ రెడ్డి గంగా జలం బాటిల్స్ ను ప్రజలకు ఉచితంగా అందజేశారు. ఒక్కో బాటిల్ ముప్పై రూపాయలకు అంద జేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.....2వేల కి.మీ ల దూరం లో ఉన్న గంగా నది జన్మ స్థలం అయిన గంగోత్రి మరియు రిషికేశ్ నుండి సేకరించబడిన గంగా జలం బాటిల్స్ అన్ని పోస్ట్ ఆఫీస్ లలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ స్వచ్ఛ జలాన్ని పూజ, అభిషేకం కొరకు ఉపయోగించవలెనని, ప్రస్తుతం గంగోత్రి మరియు రిషికేశ్ నుండి పవిత్ర గంగాజలం ను ఇండియా పోస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు పంపిణీ చేయబడుతుందని ఆయన చెప్పారు.

## పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్టు



పోలీస్‌ల అదుపులో పేకాటారాయుళ్లు

వికారాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22)ః వికారాబాద్ పోలీస్ స్టేషన్, టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు కలిసి వికారాబాద్ టౌన్ పీఎస్ పరిధిలోని కొంపల్లి గ్రామంలోని ఓ ఫామ్‌హౌస్‌లో దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడు మంది సభ్యులను అదుపులోకి తీసుకోని వారి నుండి 19,250 రూపాయలు, 6 మొబైల్ ఫోన్లు, కారు, 2 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏడుగురిపై పైన వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదుకు మంచి స్పందన

- ఏఐటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకిరాం చౌహాన్



బిజెపి పార్టీ సభ్యత్వ నమోదులో బిజెపి నాయకులు

కుల్కచర్ల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22)ః బిజెపి సభ్యత్వానికి మంచి స్పందన లభిస్తుందని ఏఐటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానకిరాంచౌహాన్ అన్నారు. మండల కేంద్రంలో బిజెపి పార్టీ అసెంబ్లీ కన్వీనర్ మారుతి కిరణ్ భూనేటి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతంలో యువకులు సైతం బిజెపి పార్టీని ఇష్టపడుతున్నారని బిజెపి పార్టీ సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు చంద్రలింగం, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు సురేష్ బిజెపి నాయకులు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత అంత్యక్రియల్లో పాల్గొన్న తిరుపతిరెడ్డి



కాంగ్రెస్ సీనియర్ నేత నర్సిరెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, నాయకులు

బొంరాస్‌పేట్, మేజర్ న్యూస్ (అక్టోబరు 22): బొంరాస్‌పేట్ మండల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత నర్సిరెడ్డి సోమవారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి చెందారనే విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి మంగళవారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబాన్ని పరామర్శించి పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బొంరాస్‌పేట్, కొడంగల్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సిములుగౌడ్, ఎన్.ప్రశాంత్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్, నర్సిములునాయుడు, మెరుగు వెంకటయ్య, మల్లేశ్, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 25న మండల సమీకృత భవనం కోసం సర్వే

బొంరాస్‌పేట్, అక్టోబరు 22 (మేజర్‌న్యూస్): ఈ నెల 25న దుద్యాల గ్రామ శివారులోని 1105 సర్వే నెంబర్‌లో మండల సమీకృత భవనం కోసం సర్వే నిర్వహించనున్నట్లు దుద్యాల తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సర్వేలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.

## నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ తిరుపతిరెడ్డికి సన్మానం



తిరుపతిరెడ్డిని సన్మానించిన కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్‌లు

కొడంగల్, మేజర్ న్యూస్ (అక్టోబరు 22): కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, డైరెక్టర్‌లు ఆసిఫ్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి సన్మానించారు. మంగళవారం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో తిరుపతిరెడ్డిని కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### అన్ని రంగాలలో మున్సిపాలిటీ అభివృద్ధికి

## కౌన్సిల్ నిరంతరం కృషి

– పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి



రొడ్డు పనులు పరిశీలిస్తున్న చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి.

ఘట్‌కేసర్ రూరల్, మేజర్‌న్యూస్(అక్టోబర్ 22) : అన్ని రంగాలలో మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా కౌన్సిల్ నిరంతరం కృషి చేస్తుందని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ ఎన్‌టిపిసి రోడ్డులోని దాదాపు రూ.30 లక్షలతో బీటీ రోడ్డు విస్తీర్ణ పనులు మంగళవారం చైర్మన్ పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం బీటీ పనులు చేపట్టడం జరుగుతుందని, దీనితో ప్రజలకు రవాణ వ్యవస్థ మరింత మెరుగుపడుతుంద ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కొమ్ముల ప్రశాంత్, మున్సిపాలిటీ సిబ్బంది వినోద్ రెడ్డి, అక్షయ్, సుభాష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

- బిజెపి నాయకులు వార్ల ఆంజనేయులు, గణపురం చిన్న వెంకటయ్య గౌడ్



విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న బిజెపి నాయకులు

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22)ః కుల్కచర్ల మండల పరిధిలో ఘనపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు పంద్రాగస్టు రోజున మధ్యాహ్న భోజనం కోసం విద్యార్థులకు ఇబ్బంది రావద్దనే ఉద్దేశంతో ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, పాఠశాలకు ఎలక్ట్రికల్ బెల్ అందజేయడం జరిగిందని బిజెపి నాయకులు వార్ల ఆంజనేయులు, చిన్న వెంకటయ్య గౌడ్ అన్నారు.అనంతరం హెచ్ ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు దాతలు వార్ల ఆంజనేయులు, వెంకటయ్య గౌడ్ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకర్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో పాఠశాల అభివృద్ధికై తన వంతు ఆర్థిక సహాయంగా ముందుకూ వచ్చి ఇచ్చినందుకు ప్రత్యేకంగా ధన్యావాదాలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికై గ్రామంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దండు. లక్ష్మి, హన్మంతు, చీపిరి శ్రీనివాస్, కొండ. నర్సింలు ఆంజనేయులు, నర్సింలు బొక్క. రమేష్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మహానగరాన్ని సియోల్ నగరంగా అభివృద్ధి

**–సౌత్ కొరియా సీయెల్‌లో మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన**





చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22) ః తెలంగాణ రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సౌత్ కొరియా సీయోల్‌లో రెండో రోజు పర్యటనలో భాగంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, మేయర్ విజయలక్ష్మిలు దక్షిణకొరియా రాజధాని సియోల్‌లోని హాన్ రివర్‌బోర్డు డిప్యూటీ మేయర్ జో యంగ్ టీ, బోర్డు డైరెక్టర్లు యోఘక్ కిమ్, పార్క్ జిన్ యంగ్, యున్ సియోక్ హ్యాన్, యెరిమ్ లీ, హాన్ రివర్ మేనెజ్‌మెంట్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్ పునరుజ్జీవం చేసిన తర్వాత సియోల్ నగరం యొక్క రూపురేఖలు మారాయని, మూసి రివర్‌ని కూడా ప్రక్షాళన చేసి, హైదరాబాద్ మహానగరాన్ని సియోల్ నగరంగా అభివృద్ధి చేస్తామని మంత్రులు తెలిపారు.

# అర్హులైన గీతాకార్మికులందరికి కాటమయ్య రక్షా కిట్లు పంపిణీ చేయాలి

**– గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గౌని నర్సింహ్మాగౌడ్**




మాడ్గుల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22):కల్లుగీతా వృత్తిపై ఆధారపడి కుటుంబాలను పోశించుకుంటున్న మాడ్గుల మండలంలోని గీతాకార్మికులందరికి రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షా కిట్లను పంపిణీ చేయాలని గౌడ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు గౌని నర్సింహ్మాగౌడ్ కోరారు. కల్లుగీతకు వెళ్తున్న గీతాకార్మికులు ఆధునిక పనిముట్లు అందుబాటులో లేక ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోవడం, గాయాలకు గురవ్వడం జరుగుతున్నట్లు ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు మాడ్గుల మండలంలో అర్హులైన గీతాకార్మికులకు వృత్తి లైసెన్సులు, కాటమయ్య కిట్లను పంపిణీ చేయాలని కోరుతూ మంగళవారం అందుగుల సింగిల్‌విండో డైరెక్టర్ కొప్పుల జగన్‌గౌడ్, గౌడ యువజన సంఘం నాయకులతో కలిసి ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఎస్.ఐలు కృష్ణప్రసాద్, స్వప్నలకు గౌని నర్సింహ్మాగౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచనల మేరకు కాటమయ్య కిట్ల మంజూరు కొరకు మండలంలోని వివిధ గ్రామాల గీతాకార్మికుల వృత్తి లైసెన్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో పాటు ఫోటోను జతచేసి అధికారులకు అందజేసినట్లు తెలిపారు. వీలైనంత అర్హులైన వారందరికి కాటమయ్య కిట్లు, పెండింగ్‌లో ఉన్న వృత్తి లైసెన్స్‌లు జారీ చేసేలా చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ అధికారులను కోరడం జరిగిందని ఆయన వివరించారు. వినతిపత్రం అందజేసినవారిలో గౌడ యువజన సంఘం నాయకులు గజ్జె సత్యంగౌడ్, జెల్ల రమేష్‌గౌడ్, ఎర్కల శివకుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## నూతన కమ్యూనిటి హాల్‌కు శంకుస్థాపన...



మణికొండ, మేజర్ న్యూస్(అక్టోబర్ 22)ః మణికొండ మున్సిపల్‌లోని 18వ వార్డు పుప్పాలగూడ శివనగర్ కాలనీలో 42లక్షలతో ఏర్పాటుచేస్తున్న నూతన కమ్యూనిటి హాల్ నిర్మాణ పనులను మంగ ళవారం మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముఖ్యఅతిధిగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అన్నారు. ఈ కర్యాక్రమంలో స్థానిక కౌన్సిలర పురుషోత్తం లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు యాదయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎస్ కిరణ్‌కుమార్, శివనగర్ కాలనీ సంఘ సభ్యులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులుగా సొంటె శ్రీను




షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 22) : బహుజన సమాజ్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జిగా సొంటె శ్రీనును నియమిస్తూ నియామక పత్రం అందజేసినట్లు ఆ పార్టీ జిల్లా ఇంచార్జి దొడ్డి శ్రీను పేర్కొన్నారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సొంటె శ్రీనును అసెంబ్లీ అధ్యక్షుడిగా నియమిస్తూ ఏకగ్రీవ తీర్మాణం చేసినట్లు తెలిపారు. కేశంపేట మండలం కాకునూరు గ్రామానికి చెందిన సొంటె శ్రీను 2020 వ సంవత్సరంలో బహుజన సమాజ్ పార్టీలో చేరారు. ఆంగ్ల భాషలో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు జర్నలిజంలో పీజీ చేసి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న సొంటె శ్రీను అనతి కాలంలోనే షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం పట్ల ఆ పార్టీ కార్యకర్తలు అనందాన్ని వ్యక్తం చేశారు. తనపై విశ్వాసంతో అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ గ్రామీణ స్థాయిలో బీఎస్పీ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గ్యార జగన్, కార్యవర్గ సభ్యులు అబ్రహం లింకన్, జిల్లా అధ్యక్షుడు పల్లాటి రాములు, ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు గుండేటి నర్సింహ్మ, రాంప్రసాద్ గౌడ్, రాములు, ఆశీర్వాదం, లింగం, తుప్పరి కుమార్, హరి కుమార్, మహేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది : బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్



మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22) : ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన మేజర్ న్యూస్‌తో మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం బీఆర్ఎస్ జిల్లా అద్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన దసరా సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతున్న ప్రజల పక్షాన పోరాడవలసిన ప్రజా ఉద్యమాల పార్టీలుగా గుర్తింపు పొందిన కమ్యూనిస్టులు ఎందుకు మౌనంగా ఉన్నారని కేటీఆర్ అనడంలో తప్పు లేదన్నారు. కేటీఆర్ కమ్యూనిస్టులను విమర్శించలేదని, వారి బాధ్యతను గుర్తు చేశారని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతుందని, పది నెలల్లోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని, ఆరు గ్యారంటీలు అమలు చేశామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు అబద్ధాలు మాట్లాడడం ఆపి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

# పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీలో శరవేగంగా అభివృద్ధి పనులు








అబ్దుల్లాపూర్ మెట్టు, మేజర్ న్యూస్,(అక్టోబర్ 22) :పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిదిలోని 8వ వార్డు లో గల పోలీస్ కాలనీలో మంగళవారం డ్రైనేజీ పైప్ లైన్ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పండుగుల జయశ్రీ రాజు ప్రారంభించారు. ఈ సందర్బంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ లో అభివృద్ధి పనులు శరావేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతుగా కృషి చేస్తామన్నారు. పెబడింగులో ఉన్న పనులను కాంట్రాక్టర్లు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వడ్డేపల్లి విద్యావిజేందర్ రెడ్డి, పసుల రాజేందర్, సిద్దెంకి కృష్ణా రెడ్డి, మున్సిపల్ కమీషనర్, డీ.ఈ,కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

# పలు డివిజన్‌లలో డ్రైనేజీ పనులను ప్రారంభించిన మేయర్ పారిజాత



బాలాపూర్, మేజర్‌న్యూస్ ( అక్టోబర్ 22): బడంగ్‌పేట్ మున్సిపాలిటీ కార్పోరేషన్ 30,31, 32 ల డివిజన్‌లలో డ్రైనేజీ నిర్మాణ పనులను మంగళవారం పీసీసీ ప్రధానకార్యదర్శి, కార్పోరేషన్‌మేయర్ చిగురింత పారిజాత నర్సింహరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పోరేటర్ బీమిడి స్వప్నజంగారెడ్డి, గౌర రమాదేవి, శ్రీనివాస్, కాలనీవాసులు కొండా శ్రవణ్ కుమార్ యాదవ్, శ్యామ్ సుందర్‌రెడ్డి,లక్ష్మారెడ్డి, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సిబ్బందికి మాజీ సర్పంచ్ ఆర్థిక సహాయం



కందుకూరు, మేజరన్యూస్ ( అక్టోబర్ 22): గ్రామ పంచాయతీ పారిశుద్ధ్యకార్మికుని కుటుంబానికి తాజా మాజీ సర్పంచ్ బుడ్డోళ్ల నరేందర్ గౌడ్ ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని కటికపల్లి గ్రామ పంచాయతీలో కార్మికునిగా పని చేసిన ఎంట్ల యాదయ్య మంగళవారం ఆనారోగ్య కారణంగా మరణించడంతో విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ 12 వేల రూపాయలను యాదయ్య కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది కారోబార్ చిట్టె బాలకృష్ణ, మేకం శివ, ఎంట్ల పదమ, బర్ల పోచమ్మ ఎట్టమ్మ ఉన్నారు.

# ప్రభుత్వ పనులను త్వరగా పూర్తి చేయాలి

**● జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్**
**● బషీరాబాద్ మండలంలో సుడిగాలి పర్యటన చేసిన అడిషనల్ కలెక్టర్ సుధీర్**




బషీరాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22)ః బషీరాబాద్ మండలం పరిధిలోని పర్వత్ పల్లి, దామరచేడ్, కొట్లాపూర్, ఏక్ మై గ్రామాల్లో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ పర్యటించారు. అంగన్వాడీ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొట్లాపూర్ గ్రామంలో పొలాలకు వెళ్లే మార్గంలో బైక్ పై వెళ్లి గతంలో జరిగిన పనులను పరిశీలించారు. దామరచెడు గ్రామంలో వన్ ఫేస్ మోటర్ మరమ్మత్తులు చేయించాలని కార్యదర్శిని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యుత్ వినియోగం లేకపోవడం పై అధికారుల తీరుపై ఉమ్మడి పడ్డారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు చేసిన పనులు పరిశీలించారు. పాఠశాలలో చుట్టుపక్కల పేర్కుపోయిన పిచ్చి మొక్కలు చూసి విద్యార్థుల దగ్గరికి పాములు వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పాఠశాల పైకప్పు ఉన్న చెత్త చెదారం ఎప్పటి కప్పుడు శుభ్రపరచాలన్నారు. విద్యార్థులు చదివే సమయంలో విద్యుత్ లైట్లు ఇరువైపుల నుండి ఉండాలన్నారు. ప్రభుత్వం అందించిన నిచ్చెన పంచాయతీ అన్ని పనులకు వినియోగించుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణలో నీటి కుళాయిలలో కుక్కలు నోటితో నీళ్లు తాగడం పై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు మధ్యాహ్నం భోజనం తినే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వై. వెంకటేశం, ఎంపీడీవో విజయ్ కుమార్, పంచాయతీ ఏఈ, డి ఈ, ఇంజినీరింగ్, అసిస్టెంట్ షేర్ ఖాన్,సూపర్డెంట్ విజయ్ కుమారి, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజు పటేల్ నర్సిరెడ్డి, వివిధ శాఖల అధికారులు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# ఆయోడిన్ కల్గిన ఉప్పునే వాడుదాం... ఆరోగ్యంగా ఉందాం

**● జిల్లా ఇంచార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శోభా రాణి**




**సదస్సును ఉద్దేశించి మాట్లాడుతున్న ఇంచార్జ్ డిఎం అండ్ హెచ్వో డా.శోభారాణి**

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22)ః ప్రతి ఒక్కరూ అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలి, ఆరోగ్యంగా ఉండాలని,మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్: శోభా రాణి అన్నారు.అయోడిన్ ఒక ముఖ్యమైన సూక్ష్మ పోషకము, మన గొంతు భాగంలో ఉన్న థైరాయిడ్ గ్రంధి ఈ అయోడిన్ సూక్ష్మ పోషకాలు ఉపయోగించుకొని థైరాక్సిన్ హార్మోన్ ఉత్పత్తి చేసి మన జీవ ప్రక్రియలు సక్రమంగా నిర్వర్తించుటకు పనిచేస్తుందని, దీని వల్ల శరీర పెరుగుదల, ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. మంగళ వారం జిల్లాలోని మల్కాజిగిరి లో ప్రపంచ అయోడిన్ లోప నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీ అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ... అయోడిన్ అతి ముఖ్యమైన ఆరోగ్య సూక్ష్మ పోషకమని, దీని లోపంతో గర్భస్రావం,చనిపోయి పుట్టే శిశువులు, అతి తక్కువ బరువుతో పుట్టే శిశువులు, మరుగుజ్జు తనము, బుద్ధి మాంద్యత, గొంతువాపు, పిల్లలు చదువులో వయసుకు తగ్గ ప్రతిభ చూపించలేక పోతారని తెలిపారు. ముఖ్యంగా అయోడిన్ లోప రుగ్మతల బారినపడిన లు డాక్టర్ సలహా మేరకు మందులు వాడటం వలన గర్భస్థ దశలో సంభవించబోయే దుష్పరిణామాలు పరిణామాలను అధిగమించవచ్చుని, ఆరోగ్య వంత మైన శిశువులకుజన్మ నివ్వవచ్చుని అని చెప్పారు. ప్రజలందరూ అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలని,




ర్యాలీలో పాల్గొన్న... శోభా రాణి

ఆరోగ్యంగా ఉండాలని సదస్సులో వివరించినారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా, పల్లె, బస్తి దవాఖానాల ద్వారా ప్రజలందరికీ అయోడిన్ ఉప్పుని వాడునట్లు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అందరూ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని పాఠశాలలలో, విద్యార్థి వసతి గృహాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అయోడిన్ కలిగిన ఉప్పు వాడుట వలన మంచి శారీరక మానసిక ఆరోగ్యం, పెరుగుదల, చురుకుతనం, ఉత్సాహం, మంచి జ్ఞాపకశక్తి కలిగి ఉండటం సంగ్రహణ శక్తి పెరగడం, సక్రమంగా గర్భస్థ శిశువు పెరుగుదల, చదువుల్లో వయసుకు తగ్గ ప్రతిభను పిల్లలు చూపుతారని ఈ సదస్సులో అన్నారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డా: విజయ నిర్మల, డా: వినోద్, డా: లింగాల అక్షయ్ కుమార్,డా: తెరిస్సా, రిపోర్టింగ్ అధికారులు వేణు గోపాల్, రాము, బాలరాజు, జోసెఫ్ జానకమ్మ, వెంకటేశ్వర్లు , ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.




# కొత్త వేతన సవరణ స్కేళ్ళను వర్తింప చేయాలి

**● కొత్తగాడి అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షులు,టీ పి యూ ఎస్**



వికారాబాద్, మేజర్న్యూస్ (అక్టోబర్ 22)ః పెండింగ్ కరువు భత్యంలను విడుదల చేయాలని కొత్త వేతన సవరణ చేయాలి అని పెండింగ్ బిల్లులు తక్షణమే పరిష్కారం చూపాలి అని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలలో నల్ల బ్యాడ్జ్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపి యూ ఎస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరా ఉపాధ్యాయ ధర్మగ్రహ దీక్షకి సిద్ధం అవుతున్నట్టు తెలిపారు. మొదటగా పాఠశాలలో నల్ల బ్యాడ్జ్లతో నిరసన, అనంతరం ఈ నెల 28 న మండల తహసీల్దార్ లకి వినతి పత్రం సమర్పించుట, అదేవిదంగా నవంబర్ 5న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్లవద్ద ధర్నా చెప్పటడం జరుగుతుంది అని, అంత లోపు ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే నవంబర్ 23న చలో ఇందిరా పార్క్లో ధర్మగ్రహ దీక్ష చేస్తాం అని అన్నారు. ఎన్నో ఆశలు తో ఏర్పాటు అయినా కొత్త ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో చెప్పినట్టు డిఏ, పిఆర్సి, పెండింగ్ బిల్లు లు పరిష్కారం అవుతాయి అని రాష్ట్ర వ్యాప్తంగా వున్న ఉపాధ్యాయులు ఎదురుచూస్తూ ఉన్నారని, గత ప్రభుత్వం గాయాలు మన్పించే విధంగా కొత్త ప్రభుత్వం లో ఉంటాయి అనుకున్న ఉపాధ్యాయులకి నిరాశ మిగులుతుంది. ప్రభుత్వం వెంటనే అన్ని రకాల ఆర్థిక పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజి రెడ్డి, రాష్ట్ర బాధ్యలు జాకా వెంకటేశం, మండల కార్యదర్శి సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్ఐఎన్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నిక అధ్యక్షునిగా మేకల శ్రీనివాస్ గౌడ్



మేడిపల్లి ,మేజర్ న్యూస్ (అక్టోబర్ 22):బోడుప్పల్ కార్పొరేషన్ 5వ డివిజన్ ఎన్ఐఎన్ కాలనీ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైంది. కాలని అధ్యక్షునిగా మేకల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నంగునూరి నాగరాజు, కోశాధికారి ఎలుగు సురేష్ ని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి ఆధ్వర్యంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్ నివాసంలో వారిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను వజ్రెష్ యాదవ్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపి కాలనీ అభివృద్ధికి అన్ని రకాలుగా నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ అజయ్ కుమార్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కాలనీ వాసులు పబ్బు సత్యనారాయణ, సతీష్, విశ్వం గుప్తా, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరం

**● సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన మేయర్ అమర్ సింగ్ ● డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్**



**సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మేయర్ అమర్ సింగ్**

మేడిపల్లి ,మేజర్ న్యూస్ (అక్టోబర్ 22):సీఎం సహాయనిధి పేదలకు వరమని విద్యార్థుల నగర మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ కుర్ర శివకుమార్ గౌడ్ అన్నారు. ఈ మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో మేయర్ అమర్ సింగ్, డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ సమక్షంలో 26వ డివిజన్ కార్పోరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి సీఎంఆర్ఎఫ్ సహాయనిధి చెక్కులను మంగళవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీంరెడ్డి నవీన్ రెడ్డి. నాయకులు మాడుగుల చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జి4ఎస్ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ ఉద్యోగాలు

**● జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మేజర్న్యూస్ (అక్టోబర్ 22)ః అంతర్జాతీయ సెక్యూరిటీ అయిన జి4ఎస్ సెక్యూరిటీ ప్రైవేటు కంపెనీలు నందు ఉద్యోగాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ ఒక ప్రకటన తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయము, ఐటిఐ క్యాంపస్ వికారాబాదు నందు అక్టోబర్ 24 గురువారం ఉదయము 10:30 గంటలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జి4ఎస్ సెక్యూరిటీ ప్రైవేటు కంపెనీలో సుమారు 100 (సెక్యూరిటీ గార్డ్స్, ఎస్కార్ట్ గార్డ్స్ కావలెను నైట్ షిఫ్ట్ మాత్రమే) పోస్టులు ఉన్నాయని వీటికి అబ్బాయిలు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు.

ఇట్టి ఉద్యోగానికి పదవ తరగతి ఉతీర్ణత కలిగిన వారు అందరు మరియు అంత కంటే ఎక్కువ విద్యా అర్హత కలిగి ఉండాలని ఆయన అన్నారు. ఈ ఉద్యోగాలు హైదరాబాదులోని నానాక్రంగూడ కోకాపేట ఆఒఈ భవనము. 08 గంటల 26 డేస్ పనిదినములు ఉంటాయని నెల జీతం రూ. 17000 నుండి ఉంటుందని అన్నాడు. ఈ జాబ్ మేళ ద్వారా ఎంపిక చేసుకుంటారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. ఇతర వివరములకు జాబ్ మేళా నిర్వాహకుడు మియా సాబ్ 9676047444 ద్వారా సంప్రదించవచ్చునని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

# హిందువులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు : అందెల శ్రీరాములు యాదవ్

★ గట్టుపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు





మహేశ్వరం మేజర్ న్యూస్ (అక్టోబరు 22): హిందువులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మంగళవారం మహేశ్వరం మండలంలోని గట్టుపల్లి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్ కలిసి స్వామివారికి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ....ఎంతో మహిమ గలిగిన ఆలయ ప్రాంగణంలో ఒక అన్యమతస్తుడు మేకను బలిచ్చి ఆలయ ప్రాంగణాన్ని అపవిత్రం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రక్షాళనలో భాగంగా ఈరోజు అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియజేశారు. అదేవిధంగా హిందువులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని తెలిపారు. నియోజకవర్గంలో హిందువులకు ఇంత అన్యాయం జరుగుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఇప్పటివరకు స్పందించకపోవడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని, రాష్ట్రంలో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట హిందు దేవాలయలపై దాడులు జరుగుతన్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. హిందువులంతా వారిని గమనిస్తున్నారని సమయం వచ్చినప్పుడు వారికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. హిందువులందరు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పాపయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి , పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్ , జిల్లా బీజేవైఎం అధ్యక్షులు యదీష్,కుండే వెంకటేష్, మండల అధ్యక్షులు మాధవచారి, తుక్కుగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్ ,బిజెపి నాయకులు శ్రీనివాస్ యాదవ్, యువ మోర్చా అధ్యక్షులు వనంపల్లి శ్రవణ్, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఎర్ర రాఘవేందర్, మండల రాజు, క్షేత్ర నాయకులు, హిందూ బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హెచ్ఐవి,ఎయిడ్స్ పైన ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలి :జిల్లా కోఆర్డినేటర్ టి.రామ్‌రెడ్డి



కందుకూరు,మేజర్‌న్యూస్( అక్టోబర్ 22): హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని లింక్ వర్కర్ స్కీం జిల్లా కోఆర్డినేటర్ టి.రామ్‌రె డ్డి తెలపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో వైఆర్‌జీ, కేర్ స్వచ్ఛంద సంస్థ లింక వర్కర్ ప్రాజెక్ట్ ద్వారా మంగళవారం మండలంలోని నేదునూరు ఉన్నత పాఠశాలలో 9, 10 తరగతల విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖవ్యాధులు, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి ఒక వైరస్ వల్ల వస్తుందని తెలియని వ్యక్తులతో సెక్స్‌వల్ సంబంధాల వల్ల ఎక్కువ వచ్చే అవకాశాలు ఉన్నాయని, టెస్ట్ చేయని రక్తము, నీడిల్స్ చిరంజలు ఒకరి ద్వారా ఒకరు ఎక్కించుకుంటే వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు పెళ్లికి ముందు చెడుకు దూరంగా ఉండాలని, ఎవరితో ఎలాంటి సెక్స్‌వల్ లింకులు పెట్టు కోవద్దని చెప్పారు.హెచ్ఐవి వచ్చిన వ్యక్తికి అంటే ఎయిడ్స్ వచ్చిన వ్యక్తిని కలిసి మాట్లాడిన కలిసి భోజనం చేసిన కలిసి కూర్చున్న రాదని, కేవలం సెక్స్‌వల్ సంబంధాలతో వస్తుందని అందరు తెలుసుకోవల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు.కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, లింక్ వర్కర్ లలిత పాల్గొన్నారు.

## షాద్ నగర్ సెంబ్లీ బిఎస్పి అధ్యక్షునిగా సొంటె శ్రీనివాస్



కేశంపేట్ మేజర్ న్యూస్ (అక్టోబర్ 22) మండలంలోని కాకునూరు గ్రామానికి చెందిన సొంటె శ్రీనివాస్ ని బహుజన్ సమాజ్ పార్టీ షాద్ నగర్ యోజకవర్గం అధ్యక్షులుగా నియమించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండెల ధర్మేందర్ , రాష్ట్ర కార్యదర్శి గ్యార జగన్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అబ్రహం లింకన్ , జిల్లా ఇంచార్జ్ దొడ్డి శ్రీనివాస్ , జిల్లా అధ్యక్షులు పల్లాటి రాములు , జిల్లా ఉపాధ్యక్షులు కాటేపాక రమేష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై, సొంటె శ్రీనివాస్ ని ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా నియమించడం జరిగింది, ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన బిఎస్పి షాద్ నగర్ ధ్యక్షులు సొంటె శ్రీనివాస్ మాట్లాడుతూ షాద్ నగర్ యోజకవర్గం లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు, నాకు ఈ పదవి రావడానికి కారకులైన రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి నియోజకవర్గ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సీనియర్ నాయకులు పి లింగం , నర్సింలు, రాంప్రసాద్ , ఆశీర్వాదం, మోజెస్, తుప్పరి కుమార్, ఎర్రోళ్ల కృష్ణ, హరికుమార్, ఆంజనేయులు, మహేందర్, శరత్, నీరటి రాజు, జయప్రకాష్, దొడ్డి చందు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తల దినచర్య రికార్డుల పంపిణీ



బాలాపూర్, మేజర్ న్యూస్ ( అక్టోబర్ 22): బాలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ఆశా కార్యకర్తల దినచ ర్య రికార్డులను మంగళవారం పంపిణీ చేశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ ఆర్యోగకేంద్రంలో మెడికల్ ఆఫీసర్ సిబ్బంది ఆద్వర్యంలో ఆశకార్యక్తలకు రికార్డులు అందజేశారు. మాట్లాడుతూ... గతంలో స్వంత డబ్బులతో రికార్డులను కొని రాసి అధికారులకు చూపంచే వారని, నేటి ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు దినచర్యల రికార్డులు అందజేసి ఏడాదికి ఒకటి చొప్పున ఒక ఆశాకార్యకర్తకు ఐదు రికార్డుల చొప్పున 30 మందిక దాదాపు 150 రికార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## అధిక సాంద్రత పత్తి సాగు ఎంతో మేలు

★ చిత్తాపూర్‌లో అధిక సాంద్రత పత్తి సాగు పరిశీలన




మంచాల, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22) : అధిక సాంద్రత పత్తి సాగు విధానం రైతులకు ఎంతో మేలు చేస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కోన్నారు. మంగళవారం చిత్తాపూర్ గ్రామంలో రైతు క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో రైతులకు ఎకరానికి 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఒకే సారి పత్తి ఏరడం వలన గులాబీరంగు, కాయతొలిచే పురుగుతో నష్టం ఉండదన్నారు. కోత తరువాత తఅరుతడి పంటలు సాగు చేసుకోవచ్చని, తద్వారా పంట మార్పిడితో పాటు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మంచాల రైతు వేదికలో పత్తి, కంది సాగులో మెలకువల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అదికారి నరసింహరావు, ఏడిఎ సుజాత, శాస్త్రవేత్తలు చంద్రకాంత్, ఏఆర్ రెడ్డి, భాస్కరన్,షేక్, ఎన్ మీరా, శ్రీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి మాధవిలత, ఏఈఓలు సాయి సిరి, సాయి వాణి, లింగస్వామి, రైతు సంఘం చైర్మెన్ సుధాకర్, నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా బాధితులకు అండగా ఉంటాం

### – బీజేపీ తోకల శ్రీనివాస్‌రెడ్డి



గండిపేట్, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22) : రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో హైడ్రా బాధితులకు భారతీయ జనతా పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని నియోజకవర్గం బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్, బైరాగిగూడ, గంధంగూడ తదితర ప్రాంతాల్లో మూసీ హైడ్రా ఇళ్లు కోల్పోతున్న బాధితుల పలు కాలనీలు, విఘ్నేశ్వర కాలనీ, శివపురి కాలనీ, ద త్తాత్రేయ కాలనీ, కిస్మత్‌పూర్‌లో రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఆదిలాబాద్ శాసనసభ్యులు ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు పర్యటించి మూసీ బాధితులకు అండగా నిలబడేందుకు పర్యటించనున్నారని తెలిపారు. మూసీ బాధితులకు అండగా ఉండేందుకు, వారి పక్షాన పోరాడేందుకు, పేద ప్రజలకు, వారి కుటుంబానికి నష్టం జరగకుండా, అన్యాయం జరగకుండా వారి పక్షాన బీజేపీ పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కొమురయ్య, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, బుక్క వేణుగోపాల్, బీజేఎంసీ అధ్యక్షులు మహేష్ యాదవ్, మహాలింగం, కడెం, రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, శేఖర్ ముదిరాజ్, నవీన్‌రెడ్డి, పవన్, సుధాకర్, భీమార్జున్‌రెడ్డి, వేణురెడ్డి, ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శాలివాహన కుమ్మర సంఘం సమావేశం..



మణికొండ, మేజర్ న్యూస్(అక్టోబర్ 22)ః నూతనంగా ఏర్పాటైన శాలివాహన కుమ్మర సంఘం నిర్వహించిన సమావేశంలో మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణికొండ మున్సిపల్‌లోని నూతనంగా ఏర్పాటుఅయిన వారికి ఎల్లప్పుడు తోడుగా ఉంటానని అన్నారు. తనవంతుగా సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, నాయకులు ముత్యాలు, కిరణ్‌కుమార్ మరియు కుమ్మర సంఘం కార్యవర్గ సభ్యులు నర్సింగ్‌రావు, శ్రీశైలం, మల్లేష్, మోహన్‌కృష్ణ, విజయ్, బాలయ్య, బిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరిశుభ్రమైనా ఆహారం అందించాలి : ఎంఈవో నర్సింహ



కందుకూరు, మేజర్‌న్యూస్ ( అక్టోబర్ 22): పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈవో నర్సింహ సూచించారు. మండలంలోని నేదునూరు మోడల్ స్కూల్ ప్రధానమంత్రి పథకం ద్వారా నూతన గది నిర్మానాణికి రూ.13.5 లక్షలు, మరమత్తులు రూ.4.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా మరమత్తులకు రూ.8 లక్షల మంజూరు అయినట్లు ఎంఈవో తెలిపారు. డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఖలీముద్దీన్‌తో కలిసి ఎంఈవో పాఠశాలను సందర్శించారు.పనులను త్వరగా ప్రారంభించాలని సూచించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మెనూ ప్రకారం వంట చేయాలని చూచించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ విష్ణుప్రియ,ఏఈ శ్రీనివాస్, సహాయక ఇంజనీర్లు, సీఆర్‌పీ వెంకటేష్ పాల్గొన్నారు.

# నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థికి సత్కారం

★నీట్‌లో 579 మార్కులతో మెడిసిన్ సీటు సాధించిన సాయినాథ్‌ను అభినందించి సత్కరించిన ఆమనగల్లు నాయీబ్రాహ్మణసేవా సంఘం నాయకులు



ఆమనగల్లు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 22):ఆమనగల్లు పట్టణానికి చెందిన వీరమల్ల ఊర్మిళ, రాధాకృష్ణమూర్తి దంపతుల చిన్నకుమారుడు సాయినాథ్ ఈ యేడాది నీట్ అర్హత పరీక్షలో 579 మార్కులు సాధించి వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు దక్కించుకున్నాడు. ఈ మేరకు విషయం తెలుసుకున్న నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాస్నుల దశరథం ఆధ్వర్యంలో ఆమనగల్లు నాయీ బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు సాయినాథ్‌ను అదే విధంగా ఆయన తల్లిదండ్రులైన ఊర్మిళ, రాధాకృష్ణమూర్తి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ చిన్నతనం నుండే క్రమశిక్షణ, పట్టుదలతో విద్యాభ్యాసం చేస్తూ మెడిసిన్ సీటును సాధించిన సాయినాథ్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.. సాయినాథ్‌ను సత్కరించినవారిలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం మండల గౌరవాధ్యక్షులు పెరికేటి యాదయ్య, మండల అధ్యక్షులు కాస్నుల గణేష్, పట్టణ అధ్యక్షులు దేవరకొండ రమేష్, సభ్యులు జంపుల యాదగిరి, గుద్దేటి బాలు, జాజాల రాంచంద్రయ్య, కాస్నుల రాజు, జంపుల సురేష్, జాజాల అడివయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు సిహెచ్‌సి నూతన భవన నిర్మాణ పనులు పరిశీలన

▶▶ పంచాయతిరాజ్ ఎస్.ఈ ఆదేశాల మేరకు నిర్మాణ పనులు పరిశీలించిన ఇఇ, డిఇ, ఏఇలు ▶▶ భవన నిర్మాణ బేస్ ఎత్తు పెంచాలని నిర్మాణ కాంట్రాక్టర్‌కు అధికారుల ఆదేశాలు



ఆమనగల్లు, మేజర్‌న్యూస్(అక్టోబర్ 22): ఆమనగల్లు పట్టణంలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్‌ను సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి సిహెచ్ సి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ నిబంధనల మేరకు ఆసుపత్రి భవన నిర్మాణ బేస్‌మెంట్ ఎత్తు పెంచాలని సంబంధితశాఖ అధికారులు, నిర్మాణ కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించడం జరిగింది. ఈ మేరకు మంగళవారం పంచాయతిరాజ్ శాఖ ఎస్.ఇ సురేందర్‌రెడ్డి ఆదేశానుసారం పంచాయతిరాజ్ శాఖ గ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీందర్‌రెడ్డి, డిప్యూటి ఇఇ రవీందర్, అసిస్టెంట్ ఇంజనీర్ బాల్‌రెడ్డిలు కమ్యూనిటి హెల్త్ సెంటర్ నూతన భవన నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నూతన భవనం స్లాబ్ నిర్మాణానికి ఇప్పటికే సిద్ధం చేసిన సెంట్రింగ్ చెక్కను తొలగించి బేస్‌మెంట్ ఎత్తును పెంచాలని వారు నిర్మాణ కాంట్రాక్టర్‌కు సూచించారు. భవన నిర్మాణ పురోగతిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు మెకానిక్ బాబా ఉన్నారు.

# కబ్జాచేసిన ఇంటినిర్మాణ పనులను ఆపివేయాలని కమీషనర్‌కు వినతి

బాలాపూర్, మేజర్‌న్యూస్ ( అక్టోబర్ 22): న్యూగాయిత్రి నగర్ పేస్-1 కొందమంది ప్రజాప్రతినిధుల అండతో అనుమతి లేకుండా దర్జాగ కబ్జాచేసి ఇంటినిర్మాణ పనులను చేపట్టారని అట్టిపనులను నిలిపి వేయాలని కమీషనర్ చంద్రశేఖర్ గుప్తకు కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పోరేషన్ జిల్లాలగూడ 20 వ డివిజన్ న్యూ గాయిత్రినగర్ పేస్-1 లో కొంత మంది అండ దండలతో 220 గజాల ఇంటి స్థలాన్ని ఎటువంటి పత్రాలు లేకుండా, మున్సిపాటి అనుమతి తీసుకోకుండా దర్జాగా కబ్జా చేశారని, ఇంటి నిర్మాణ పనులు చేపట్టడంతో అట్టి నిర్మాణం ఆపేయాలని కాలనీ వెల్ఫేర్ అసోసియేన్ ఫెడరేషన్ తరుపున కమీషనర్‌కు విన్నవించారు. అట్టి కబ్జా విషయం స్థానిక శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకరావడంతో ఎమ్మెల్యే దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడం జరిగిందని కాలనీ వాసులు పేర్కొన్నారు. అట్టి కట్టడంపై కాలనీ ఫెడరేషన్, మీర్‌పేట్ మున్సిఫల్ కార్పోరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి కమీషనర్ దృష్టికి తీసుకెళ్లగా మున్సిపల్ సిబ్బంది పనులను ఆపేయడం జరిగిందన్నారు. కాబ్జా రాయులు మళ్లీ తిరిగి నిర్మాణం చేపట్టకుండా అట్టి కట్టడాన్ని కూల్చి వేసి తగు చర్యలు తీసుకోవాలి కమీషర్‌కు కాలని అధ్యక్షులు ఎస్.చంద్ర శేఖర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి వంటేర్ నర్సింహరెడ్డి, శ్రీ గాయిత్రి కాలని అధ్యక్షులు మల్లారెడ్డి,



సభ్యులు శివానందం , దండు మహేందర్; శ్రవన్ కుమార్ రెడ్డిలతో కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై కమీషనర్ సానుకూలంగా స్పందించి ఎట్టి పరిస్థితులలో అక్రమ నిర్మాణాలు అనుమతించమని భూములను ఆక్ర మించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అట్టి నిర్మాణాన్ని కూల్చివేస్తామని కమీషనర్ హామి ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు.

# డివిజన్‌స్థాయి సెమినార్‌ను విజయవంతం చేయాలి

–సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22) ఃనవంబర్ 1న నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేవెళ్ల డివిజన్ స్థాయి సెమినార్ విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి, బీకెఎంయు జిల్లా అధ్యక్షులు జె.అంజయ్య అన్నారు. సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను మంగళవారం చేవెళ్లలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... చేవెళ్లలోని అంబేద్కర్ సెమినార్ ఉంటుందన్నారు. రాష్ట్రంలో ఉన్న పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఇంటి స్థలాలు లేనివారికి 120గజాల ఇంటి జాగా ఇవ్వాలన్నారు. పేదలందరికి రేషన్ కార్డులు, మహిళలకు రూ.2500, ఉపాధి హామీ కూలీల పని దినాలను 200రోజులకు పెంచి దినసరి కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎస్‌రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రభులింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్‌గౌడ్, సీపీఐ పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు వడ్ల మంజుల, మండల నాయకురాలు స్వరూప, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు శివ, కిష్టయ్య, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

## టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం



శంషాబాద్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22) : శంషాబాద్ లోని సిగ్నేచర్ గ్రూప్స్ ఓయో హెూటల్ లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో శంషాబాద్ మండల, స్థాయి జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ జర్నలిస్టుల ఆత్మీయ సమావేశానికి టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లాలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డ్స్ మంజూరు తో పాటు అక్రిడియేషన్ కార్డుల జారీ విషయంపై జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో విధివిధానాలను వివరాలు వెల్లడించారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ,, తమ వివరాలు పొందుపరుస్తూ రెండు ఫోటోలు పనిచేస్తున్న సంస్థ వివరాలతో పాటు ఆధార కార్డు తదితర వివరాలను పూర్తి చేసి ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వపరంగా పనిచేస్తున్న అందరి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డులు వచ్చే విధంగా టీయూడబ్ల్యూజే ఐ జీవితా తరఫున ప్రభుత్వానికి తెలియపరుస్తామని ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

# గండిపేట్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు చొరవ

– మండల నూతన విద్యాధికారి విజయ్‌కుమార్



గండిపేట్, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22) : గండిపేట్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని నూతన మండల విద్యాధికారి విజయ్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం గండిపేట్ మండల విద్యాధికారిగా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగడానికి నాణ్యమైన విద్యను అందించేలా ఉపాధ్యాయులకు సహకరిస్తామన్నారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేసే ఉపాధ్యాయులు ఎంతో అనుభవం కలిగిన వారు ఉంటారని, అందువల్ల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దేలా చూస్తామని వివరించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రతినిత్యం మండల పరిధిలోని ఏదో ఓ పాఠశాలను సందర్శించేలా ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు.



గండిపేట్, మేజర్‌న్యూస్ (అక్టోబర్ 22) : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేలన కోకాపేట్ శుభం బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 1997-1998 సంవత్సరంలో నార్సింగి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసుకొని 26 సంవత్సరాల తర్వాత తామంతా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు అన్నారు.

# టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న సంగీత లక్ష్మి



కందుకూరు, మేజర్‌న్యూస్ ( అక్టోబర్ 22): మహేశ్వరం మండలంలోని ఘట్టుపల్లి పారథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు దూపాటి సంగీత లక్ష్మి టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయలకు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు ప్రధానోత్సవం హైద్రాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో సంగత లక్ష్మిని శాలువాతో సన్మానించి అవార్డు అందించారు. గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయురాలు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసినందకు గాను ఈఅవార్డు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... తన వంతుగా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందకు కృషి చేశానని నా సేవలను గుర్తించిన శారద ఎడ్యూకేషనల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటి సంస్థ చైర్న్ డాకర్ట పట్నం కమలమనోహర్, డాక్టర్ నరేంద్ర స్వామి,జగన్‌మోహన్ రావు, మునిషి జిందాల్ పాల్గొన్నారు.

# అనవసర రాద్ధాంతం వద్దు..!

- టీటీడీ స్వయం ప్రతిపత్తి గల సంస్థ
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు


**బక్కని నర్సింహులు**

షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (అక్టోబరు 22) : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థ అని, బోర్డు నిర్ణయాలను ఇతరులకు ఆపాదించి అనవసర రాద్ధాంతం చేయవద్దని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు బక్కని నర్సింహులు హితవుపలికారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి ఇటీవల తిరుమలలో చేసిన కామెంట్లపై ఆయన స్పందిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల లేఖల విషయంలో వ్యత్యాసం చూపుతున్నారని, ఆంధ్రప్రదే శ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని బాధ్యుడిగా చేస్తూ జడ్చర్ల ఎమ్మెల్యే వ్యాఖ్యానించ డాన్ని ఆయన తప్పుపట్టారు. ఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి స్థాయికి మించి చంద్రబాబు నాయుడిపై వ్యాఖ్యలు చేయడం సరికాదని లేఖలో పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ అంటూ ఇరు ప్రాంతాల వ్యాపారాలు, దైవ దర్శనాల గురించి జడ్చర్ల ఎమ్మెల్యే ప్రస్తావించడం ఇరు ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నమేనని అలా మాట్లాడడం సహించరానిదని పేర్కొన్నారు. ప్రాంతాల గురించి మాట్లాడే ముందు ఏ ప్రాంతానికి ఎవరు వలస వచ్చారో సురవరం ప్రతాప్ రెడ్డి రచించిన పుస్తకాలను చదివి ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుందన్నారు. టీటీడీ బోర్డు అక్కడి భక్తుల రద్దీ దృష్ట్యా తెలంగాణ ప్రాంత నాయకుల సిఫారసు లేఖలే కాదు.. ఆంధ్ర ప్రాంత నాయకుల సిఫారసు లేఖలను పక్కన పెట్టడం సహజమేనన్నారు. సాధారణ భక్తుల సౌకర్యార్థం కోసం టీటీడీ బోర్డు కొన్ని నిర్ణయాలు తీసుకుంటుందని, దీనిని పక్కదారి పట్టించే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. గతంలో ఎమ్మెల్యే అనిరుథ్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా టీడీపీ సాంకేతిక నిపుణుల విభాగం అధ్యక్షుడిగా పనిచేసిన విషయం మర్చిపోరాదని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ ప్రాంతాల గురించి అన్వేషణ చేయడం మంచి సాంప్రదాయం కాదని పేర్కొన్నారు. తాను టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉన్నప్పుడు కూడా సామాన్య భక్తులకు ఇబ్బంది కలిగించలేదని, కలియుగ దైవం సన్నిధిలో అందరు సమానమే అన్న భావన మర్చిపోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.



టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

# పిడుగుపాటుకు మూగజీవుల మృతి



కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22): పిడుగుపాటుకు మూగజీవులు మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలోని సాల్విడ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం సాల్విడ్ గ్రామానికి చెందిన జోగు అంజిలయ్య తన పొలంలో చెట్టు కింద రెండు గొర్రెలను కట్టేసి ఉంచాడు. పిడుగు పడడంతో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రైతు అంజిలయ్య ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం చేయాలని వేడుకుంటున్నారు.

# తెలంగాణ దళితరత్న మొగిలన్నకు డాక్టరేట్




ఘట్‌కేసర్, మేజర్‌న్యూస్(అక్టోబర్, 22): తెలంగాణ దళితరత్న అవార్డు గ్రహీత, తెలంగాణ దళితదండు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రమల్ల మొగిలన్నకు గౌరవ డాక్టరేట్ వరించింది. పాండిచ్చేరికు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నారీ లక్ష్యసాధన ఫౌండేషన్ హైదరాబాద్ సహకారంతో సేవా రంగంలో మొగిలన్న చేస్తున్న కృషిని గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్ యూనివర్సిటీలో అందజేశారు. ఈ సందర్భంగా దళిత దండు ఉద్యమంలో క్రీయాశీలకంగా కృషి చేస్తూ పేదలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే క్రమంలో ప్రోత్సహించడంతో పాటు తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు గాను ఆయనకు గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేయడం జరిగిందని ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఎర్రమల్ల మొగులన్న మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే విధంగా తమ కార్యక్రమాలను రూపొందించుకుంటూ ముందుకు వెళుతున్నానని అన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ లభించడం గౌరవంగా భావిస్తూ మున్ముందు సేవ కార్యక్రమాలను ఉధృతం చేస్తామని తెలిపారు. అలాగే పలువురు ఆనందం వ్యక్తం చేయడంతో పాటు మొగులన్నకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండ ర్ డాక్టర్.పి.మాన్యుల్, చీఫ్ గెస్ట్ డాక్టర్ కె.వెంకటేష్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ బృందం అవార్డు గ్రహీతలు విద్యార్థులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన...



మణికొండ, మేజర్ న్యూస్(అక్టోబర్ 22): పనులను త్వరగితగతిన పూర్తి చేయాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యత ఉండాలని మున్సిపల్ చైర్మన్ నరేందర్ అన్నారు. మణికొండ మున్సిపల్‌లోని 5వ వార్డులోని ఫ్రెండ్స్ కాలనీలో 50 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ నరేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కౌన్సిలర్ బి. మీనా ముత్యాలు, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు కిరణ్‌కుమార్, ఫ్రెండ్స్ కాలనీ అధ్యక్షులు అబిద్ తో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనుల త్వరితగతిన పూర్తి చేయాలి

- రోడ్డు విస్తరణ పనులపై సమీక్షా సమావేశం
- అధికారులకు పలు సూచనలు చేసిన మేయర్ అమర్ సింగ్,
- డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్



**పీర్జాదిగూడ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో పాల్గొన్న మేయర్ అమర్.**

మేడిపల్లి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22):పీర్జాదిగూడ నుండి పర్వతాపూర్ వెల్లే రోడ్డు విస్తరణ పనులలో జరుగుతున్న జాప్యంపై పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ అమర్ సింగ్, డిప్యూటి మేయర్ కుర్రశివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం హెచ్ఎండిఎ, హెచ్ఎండబ్ల్యూఎస్, విద్యుత్ ఆర్ అండ్ బి, పలు శాఖల అధికారులతో పాటు మున్సిపల్ కమీషనర్ త్రిలేశ్వర్ రావు తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పీర్జాదిగూడ కార్పోరేషన్లో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులలో జరుగుతున్న జాప్యంపై, సంభందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను వేగవతం చేసి నగర ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీంరెడ్డి నవీన్ రెడ్డి సీనియర్ నాయకులు మాడుగుల చంద్రా రెడ్డి, పప్పుల అంజి రెడ్డి. యాసారం మహేష్ దేవేందర్ గౌడ్,బొడిగె కృష్ణా గౌడ్,బైటింటి ఈశ్వర్ రెడ్డి. కోఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, కమీషనర్ త్రిరేశ్వర్ రావు, డీఈ సాయినాథ్ గౌడ్, టీపీఓ సుకన్య, కరెంట్ ఏఈ సత్యనారాయణ, హెచ్ఎండబ్ల్యూ ఎస్ అదికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాత కక్షలతో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- 7 గురిపై కేసు నమోదు




**గాయాలపాలైన ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు**

కుల్కచర్ల రూరల్, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22):

కుల్కచర్ల మండల పరిధిలోని అంతారం గ్రామంలో దారుణం జరిగింది. పాత కక్షల కారణంగా రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణలో భాగంగా ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురికి గాయాలయ్యాయి. దీంట్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పాత కక్షలతో కావలి రాములు, వేపురి రామయ్య కుటుంబాల మధ్య గత 20 సంవత్సరాలుగా గోడవలున్నాయి. రెండు కుటుంబాలను గ్రామ పెద్దలు రాజీ చేసిన గొడవ పడుతూనే ఉన్నారు. సోమవారం పాత కక్షల విషయంలో మరో మారు రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. రాత్రి సమయంలో కావలి రాములుతో పాటు బసయ్య ( ప్రభుత్వ ఉపాధ్యాయుడు ) చెన్నయ్య, రాములు, అనిల్, కావాలి శ్రీను, బొల్లా నర్సింలు, కావలి తిరుపతయ్యలు వేపురి రామయ్య ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో ఉన్న వేపురి చెంద్రమౌలి, నారాయనమ్మ, వెంకటయ్య, లావణ్య, శ్రీకాంత్, చరణ్, అక్షయ లపై కర్రలతో దాడి చేశారు. అందులో వేపురి చెంద్రమౌలి , నారాయనమ్మ లకు తీవ్ర గాయాలవడంతో హైదరాబాద్ గాంధి ఆసుపత్రికి తరలించారు. ఇట్టి విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

# ఆదివాసుల ఉద్యమ కెరటం

**పోరాట యోధుడు కొమరం భీమ్ : స్వరూప**



యాచారం, మేజర్ న్యూస్, (అక్టోబర్ 22): నీరు, అడవి, భూమి ఎవరికి సొంతం కాదని, వాటిని ఆక్రమించి తన జాతి ప్రజలను బానిసలుగా చేసిన వారిపై కొమురం భీమ్ ఎన్నో ఉద్యమాలు చేసి, జల్, జంగిల్ జామీన్ అనే నినాదం తో ఆదివాసీలను చైతన్య పరిచి ఉద్యమ మరణం పొందిన గొప్ప యోధుడు కొమరం భీమ్ అని, పిఎసిఎస్ డైరెక్టర్ మక్కపల్లి స్వరూప అన్నారు. మంగళవారం కొమరం భీమ్ జయంతి సందర్భంగా స్వరూప మాట్లాడుతూ... మహనీయులు చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కొమరం భీమ్ లాంటి పోరాట పటిమ ఉన్న మహనీయుల గాథలు, యువతరనికి ఎంతో స్ఫూర్తి ని ఇస్తాయని, చిన్న వయసులోనే అన్యాయాన్ని ఎదురించే ధైర్యం, నిజాం పారపాలననే వద్దనే తెగింపు, మరణాన్ని సైతం ముద్దడిన వీరుడు కొమరం భీమ్ అని, తెలంగాణ ఉద్యమం లో అయన చరిత్ర ఎంతో స్ఫూర్తి గా నిలిచి, యువతరాన్ని ముందుకు నడిపించింది అని గుర్తు చేశారు.

# గృహిణి ఆత్మహత్య...

మేడిపల్లి, మేజర్ న్యూస్ (అక్టోబర్ 22):కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ ఎన్ ఐ ఎన్ కాలని కి చెందిన బసిరి కవిత(40) ఆమే భర్త సంతోష్ వీరికి ఓ కుమార్తె ఉండేది. అయితే గత సంవత్సరం వీరి కుమార్తె మరణించడంతో భార్య భర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి. దీంతో కవిత భర్త సంతోష్ గత నాలుగు నెలల క్రితం ఇంటినుండి వెళ్లిపోవడంతో అప్పటినుండి కవిత తన భర్త సంతోష్ కి పలుమార్లు పోన్ చేసి కలిసి ఉందామని అడిగినప్పటికీ భర్త వినిపించుకోక పోవడంతో ఆమె మానసికంగా కృంగిపోయి ఈ నెల 20వ తేదీన మధ్యాహ్న సమయంలో మేడిపల్లిలోని ఓయో ఓటల్ కు వచ్చి రూమ్ తీసుకుని అందులో ఉండే ప్యాన్ కి ఉరివేసుకుని చనిపోయింది. దీంతో మృతిరాలి తండ్రి మోహన్ రావు పిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు మృతురాలి భర్త సంతోష్ ని అదుపులోకి తీసుకుని కేసునమోదు రిమాండ్ కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి సి ఐ గోవింద్ రెడ్డి తెలిపారు.